సాక్షి
చిత్తూరు
మంగళవారం । 11 । ఏప్రిల్ । 2023



వేసవి కోతలకు సెలవు

యాదమరి: ఈ వేసవిలో విద్యుత్ కోతలుండవు. లైన్‌లాస్‌ను తగ్గించడం, అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో కలిసివచ్చింది.

-8లో



ఆర్టీసీ బస్సు బోల్తా

వడమాలపేట : సత్యవేడు నుంచి తిరుపతికి వెళుతున్న ఆర్టీసీ బస్సు వాగులో పడింది. ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి.

-8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	38	21
తిరుపతి	39	22
తిరుమల	34	18
గూడూరు	39	23
నగరి	39	22

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళవారం(సా)	సహర్ బుధవారం(ఉ)
తిరుపతి	6.28	4.42
చిత్తూరు	6.30	4.41
పుంగనూరు	6.32	4.45

న్యూస్‌రీల్

13న హుండీ కానుకలు లెక్కింపు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ కానుకల లెక్కింపు ఈ నెల 13న గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. ఉదయం 7 గంటలకు ఆలయ ఆస్థాన మండపంలో కానుకల లెక్కింపు కార్యక్రమం ఉంటుందని, ఆలయ అధికారులు, సిబ్బంది అందరూ హాజరు కావాలని కోరారు.

కోవిడ్ మాక్ డ్రిల్

చిత్తూరు రూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని ఏరియా ఆస్పత్రులు, సీహెచ్‌సీలు, సెంకడ్ వేవ్‌లో గుర్తించిన ప్రైవేటు ఆస్పత్రుల్లో సోమవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. కోవిడ్ వ్యాప్తి నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ మేరకు గత నెల అన్ని ఆస్పత్రుల్లో రెండు రోజులపాటు మాక్‌డ్రిల్ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు డ్రిల్ చేపట్టగా ఆస్పత్రులోని పడకలు, ఆక్సిజన్ సిలిండర్లు, మందులు, మాత్రలు, వసతులు తదితర అంశాలపై పరిశీలించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఈ నిర్వహణను పూర్తి స్థాయిలో పరిశీలించారు. జిల్లా ఆస్పత్రులో మంగళవారం మాక్ డ్రిల్ ఉంటుందని వారు పేర్కొన్నారు.

కోవిడ్ వార్డు ఏర్పాటు



కోవిడ్ వార్డు ప్రారంభోత్సవంలో వైద్యులు

నగరి : కోవిడ్ కేసులు అక్కడక్కడా మళ్లీ పెరుగుతుండడంతో ఈ ప్రాథమిక స్థాయిలోనే కట్టడి చేయాలని ప్రభుత్వం వేగంగా చర్యలు చేపట్టింది. స్థానిక ఏరియా ఆస్పత్రిలో 5 బెడ్లుతో కూడిన కోవిడ్ వార్డును ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం వైద్యులు ప్రారంభించారు. కోవిడ్‌కు సంబంధిత మందులు, పరికరాలు అందుబాటులో ఉంచారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ బాలకృష్ణ నాయక్, ఆర్‌ఎంవో గోపాల్, వైద్యులు కార్తిక్, నర్సింగ్ సూపరింటెండెంట్ రాజారత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 277 అర్జీలు



వినతులు స్వీకరిస్తున్న జేసీ వెంకటేశ్వర్

చిత్తూరు కలెక్టరేట్ : స్పందనకు వచ్చిన 277 వినతులను సంబంధిత శాఖల అధికారులు సత్వరం పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. ఆయన సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. వివిధ శాఖలకు సంబంధించి 277 అర్జీలు వచ్చాయని కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో రాజశేఖర్, జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి పనిచేసిన తమకు వేతనాలు ఇవ్వకపోవడం అన్యాయమని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లో వారు నిరసన కార్యక్రమం నిర్వహించి స్పందనలో వినతిపత్రం అందజేశారు. డాక్టర్ అశ్విని, జ్ఞానసుందరం, దీప మాట్లాడుతూ జిల్లాలోని పలు ఆస్పత్రుల్లో కోవిడ్ సమయంలో డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, టెక్నీషియన్, ఎంఎన్‌వోలుగా ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేశామన్నారు. కొందరికి నాలుగు నెలల జీతం, మరికొందరికి ఆరునెలల జీతం చెల్లించాల్సి ఉందన్నారు. డీఎంహెచ్‌వోకు పలు మార్లు విన్నవించినా మా సమస్యను పట్టించుకోవడం లేదని వాపోయారు.

నేడు పూలే జయంతి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలో మహాత్మా జ్యోతి బా పూలే 197 వ జయంతి వేడుకలు మంగళవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ సగిలి షన్‌మోహన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం పీసీ ఆర్ సర్కిల్లో పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించ నున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో వేడుకలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

బంగారం.. జలపుష్పం

బుడ్డ పక్కిల నుంచి ఉలసల వరకు.. జిలేబీల నుంచి బొమ్మిడాయిల వరకు.. కట్ల నుంచి కొర్రమీనుల వరకు.. గండి నుంచి గడ్డిమూస వరకు.. బంగారు తీగ నుంచి వంజరం వరకు.. వివిధ రకాల చేపలు. అరుదైనవి.. రుచికరమైనవి.. సహజవాతావరణంలో భారీ సైజ్‌లో పెరిగినవి.. చూస్తేనే చవులూరించేవి.. నోట్లో వేసుకుంటే కరిగిపోయేవి.. ఆహారప్రియుల జిహ్వాచాపల్యాన్ని పెంచేవి.. మత్స్యకారులకు కాసుల వర్షం కురిపించేవి.. నిత్యం వేలాదిమందికి జీవనోపాధిని కల్పించేవి అరణియార్ జలాశయంలోని చేపలు. మత్స్యసంపదకు కేరాఫ్‌గా మారింది ఈ ప్రాజెక్టు. ఏడాది పొడవునా సమృద్ధిగా నీరు నిల్వ ఉండడంతో జలపుష్పాలకు జీవం పోస్తోంది.

- అరణియార్ జలాశయంలో అరుదైన చేపలు
- వివిధ సైజుల్లో రుచికరమైన మీనజాతులు
- వేటతో ఉపాధి పొందుతున్న మత్స్యకారులు
- పోటీపడి కొనుగోలు చేస్తున్న ఆహారప్రియులు



రంగురంగుల్లో జిలేబీలు





అమ్మకానికి సిద్ధంగా గండి, గడ్డి చేపలు

సాక్షి, తిరుపతి డెస్క్: ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో అరణియార్ జలాశయం విశేష చేపలకు ప్రసిద్ధి. ఈ ప్రాజెక్టులో 50 గ్రాముల నుంచి 50 కిలోల బరువు చేప కూడా జీవిస్తుంది. గత ఏడాది నవంబర్‌లో భారీ వర్షాల కారణంగా కొత్తనీరు చేరడంతో చేపల పెంపకం మరింత ఊపందుకుంది. అరుదైన చేపలు జలాశయంలోకి వచ్చిచేరాయి. ఇందులో ఆస్కార్ మీనం పసుపు, బంగారు వర్ణంలో చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

అందుబాటులో వివిధ రకాలు..

జలాశయంలో కట్ల, రోహు, మ్రిగల, గ్రాస్ గడ్డి చేప, బంగారుతీగ, జిలేబీ, ఫైలెట్ జిలేబీ, నాటు పక్కిలు, ఉలసలు, బుడ్డపక్కిలు, కొర్రమీనులు, క్రాస్ బీడింగ్ జిలేబీ, రూప్‌చంద్, జెల్లలు ఇలా పలు రకాలు పెరుగుతున్నాయి. 0.25 కేజీ సైజుతో రొయ్యలు కూడా దొరుకుతున్నాయి. రిజర్వాయర్ లోకి వరద వచ్చినప్పుడు మత్స్యకారులకు భారీ చేపలు పడుతున్నాయి. ఈ క్రమంలోనే ఇటీవల కొప్పేడుకు చెందిన ఓ మత్స్యకార్మికుడి వలలో 26 కిలోల చేప పడింది. నీరు తగ్గిపోతున్నప్పుడు జలాశయం తీరంలో ఏర్పడే గుంతల్లో కొర్రమీనులు లభిస్తున్నాయి. వీటిని మత్స్యకారులు కిలో రూ.200 నుంచి 250కి అమ్ముతున్నారు. వ్యాపారులు కిలో రూ.300 నుంచి రూ.400 వరకు విక్రయిస్తున్నారు. మిగిలిన చేపలు కిలో రూ.100 నుంచి రూ.150కే లభిస్తున్నాయి.



వందల కుటుంబాలకు జీవనోపాధి

అరణియార్‌లో చేపలు పెంపకం వల్ల పిచ్చాటూరు, నింద్ర, కేవీబీ పురం, మండలాల్లోని వందలాది మత్స్యకార కుటుంబాలకు జీవనోపాధి లభిస్తోంది. వీరిలో కొందరు చేపలు పట్టేవాళ్లు ఉంటే మరి కొందరు వాటిని బయటకు తీసుకువెళ్లి అమ్ముకునే వాళ్లు ఉన్నారు.

1982లో మత్స్యకేంద్రం ఏర్పాటు

అరణియార్‌లో చేపలు ఉత్పత్తిని పెంపొందించడానికి 1982లో మత్స్యకేంద్రం ఏర్పాటు చేశారు. ఇందులో చేప పిల్లలు పెంచేందుకు 19 తొట్లు ఉన్నాయి. వీటిలో ఏటా 15 నుంచి 20 లక్షల చేప పిల్లలను పెంచుతారు. వాటిని అరణియార్‌తో పాటు చుట్టు పక్కల చెరువుల్లో వదులుతుంటారు.

భలే డిమాండ్

అరణియార్ చేపల రుచికి చేపల ప్రియులు ముగ్ధులవుతుంటారు. జాలర్లు చేపలతో ప్రాజెక్టు గట్టుపైకి రావడమే ఆలస్యం. ఎగబడి మరీ కొనుగోలు చేసేస్తుంటారు. పిచ్చాటూరుతో పాటు తమిళనాడు, తిరుపతి, చిత్తూరు తదితర ప్రాంతాల వారు సైతం ఇక్కడ నుంచి చేపలను తీసుకెళుతున్నారు. ముఖ్యంగా ఆది, సోమ, మంగళ, బుధ, గురు వారాల్లో డిమాండ్ ఎక్కువ.



చేపలను శుభ్రం చేస్తున్న మత్స్యకార్మికుడు

ఆ చేపలు పోషకాలు కలిగినవి



గుంటల్లో, చిన్న చెరువుల్లో కృత్రిమ మేత పెట్టి పెరిగే చేపల కన్నా అరణియార్‌లో సహజ సిద్ధంగా పెరిగే చేపల్లో మంచి పోషకాలు లభిస్తాయి. చేపలు తినడం వల్ల గుండె జబ్బులు ఉన్నవాళ్లకు మంచిది. చేపల్లో కొవ్వు పదార్థం ఉండదు. చేపలు తింటే కళ్ల సమస్యలు తలెత్తవు.

–డాక్టర్ ముకుందరాజు, రిటైర్డ్ ఆయుర్వేద వైద్యాధికారి, పిచ్చాటూరు

రకరకాల చేపలు



గత మూడేళ్లుగా జలాశయంలో నీరు పుష్కలంగా ఉంది. దీంతో ఎక్కువ సంఖ్యలో రకరకాల చేపలు చిక్కుతున్నాయి. చేప సైజు కూడా భారీగా పెరిగింది. ప్రభుత్వ ప్రోత్సాహం తోడవడంతో మా జీవితాలు ప్రస్తుతం ప్రశాంతంగా సాగిపోతున్నాయి. ఆహార ప్రియులు భారీగా తరలివచ్చి కొనుగోలు చేస్తున్నారు.

– కృష్ణన్, మత్స్యకారుడు, పిచ్చాటూరు మండలం

అరుదైన చేపలకు నిలయం



అరణియార్ మత్స్య కేంద్రం జిల్లాలోనే పెద్దది. అరుదైన చేపలకు ప్రసిద్ధి. ఏటా నవంబర్, డిసెంబర్‌లో 10 లక్షల చేప పిల్లలను జలాశయంలో వదులుతాం. మత్స్యకారులు స్వేచ్ఛగా వేటకు వెళ్లే అవకాశం కల్పించాం. నిత్యం ఏదో ఒక కొత్తరకం చేప వలకు చిక్కుతుంటుంది. ఇలాంటి అరుదైన చేపల్లో పోషకాలు అధికంగా ఉంటాయి.

– నరేంద్రబాబు, ఎఫ్‌డీఓ, మత్స్యకేంద్రం, పిచ్చాటూరు



బొమ్మిడాయిలు.. పక్కిలు. జెల్లలు



కొర్రమీనులు



ఆస్కార్ జిలేబీ

అరణియార్ ప్రాజెక్టులో అరుదైన ఆస్కార్ జిలేబీ సోమవారం జాలర్ల వలకు చిక్కింది. పిచ్చాటూరు ఎస్టీ కాలనీకి చెందిన మారయ్య విసిరిన వలలో ఈ చేప పడింది. దీనిపై మత్స్యశాఖ అధికారి నరేంద్రబాబు మాట్లాడుతూ ప్రాజెక్టు సమీపంలోని శేషంపేటలో రైతు శేఖర్ గత ఏడాది కలర్ చేపల పెంపకం చేపట్టాడన్నారు. నవంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు శేఖర్ చేపల గుంట మునిగిపోయింది. అందులోని చేపలు కొన్ని అరణియార్ జలాశయంలోకి చేరాయని తెలిపారు. అవే అప్పుడప్పుడు జాలర్లకు చిక్కుతున్నట్లు వెల్లడించారు.

మారయ్య వలకు చిక్కిన ఆస్కార్ జిలేబీ



బంగారుతీగ

చంద్రగిరి వాసులకు చెవిరెడ్డి కానుక

- చంద్రగిరిలో సంత గేటు ఉచితం
- విక్రయదారులకు ఊరట
- కొనుగోలు దారులకు భరోసా



ఎమ్మెల్యేని సత్కరిస్తున్న మహిళా వ్యాపారులు



సంతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

పాకాల : చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కానుక ఇచ్చారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఉన్న 11 వారపు సంతలు, దినసరి మార్కెట్లలో ఇకపై సంత గేటు రుసుము వసూలు ఉండదని ప్రకటించారు. ఈ మేరకు తన సొంత నిధులు వెచ్చించనున్నట్టు ఆయన స్పష్టం చేశారు. ఇందులో భాగంగా పాకాల మండలంలో నిర్వహిస్తున్న వారపు సంత, దినసరి మార్కెట్‌లో రైతులు, వ్యాపారులు ఎలాంటి రుసుములు చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. సోమవారం స్థానికంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చంద్రగిరి పట్టణంలో దినసరి మార్కెట్ సంతగేటును పదేళ్ల క్రితమే రద్దు చేశామన్నారు. దీన్ని ఇప్పుడు నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న అమలు చేయనున్నట్టు వెల్లడించారు. పంచాయతీల అభివృద్ధికి కావాల్సిన ఆర్థిక వనరులను సమకూర్చడం తన బాధ్యతని స్పష్టం చేశారు. రుసుము చెల్లించకుండా రైతులు తాము పండించిన పంటను స్వేచ్ఛగా విక్రయించుకునే అవకాశం కల్పించిన ఎమ్మెల్యే చెవిరెడ్డికి పలువురు రైతులు, వ్యాపారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వ్యాపారులు, రైతులు ఆ యన్ను ఆప్యాయంగా సత్కరించి అభిమానాన్ని చాటుకున్నారు.

రేపటి నుంచి కౌన్సెలింగ్

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు బుధవారం నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈవో విజయేంద్ర రావు వెల్లడించారు. ఈ మేరకు ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ గతంలో సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకున్న 1998 డీఎస్సీ అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. డీఈవో కార్యాలయంలో ఈ నెల 11న నోటీస్ బోర్డులో మెరిట్ లిస్టు ప్రచురించనున్నట్లు తెలిపారు. సంబంధిత అభ్యర్థుల సెల్‌ఫోన్‌లకు సందేశం పంపుతామన్నారు. ఈ నెల 12న (1 నుంచి 350 వరకు), 13వ తేదీన మిగిలిన వారికి కౌన్సెలింగ్ ఉంటుందని వివరించారు. ఐదు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని డీఈవో కోరారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి

- బాధ్యతలు స్వీకరించిన నూతన కలెక్టర్ సగిలి షన్‌మోహన్



కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న సగిలి షన్‌మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలను అనుసరిస్తూ జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని నూతన కలెక్టర్ సగిలి షన్‌మోహన్ అన్నారు. ఆయన సోమవారం కలెక్టరేట్‌కు విచ్చేయగా, అధికారులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన తన తల్లిదండ్రులు శివయ్య, శ్రీదేవి సమక్షంలో కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఎస్పీ రిశాంత్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, ఏఎస్పీ జగదీశ్, డీఆర్‌వో రాజశేఖర్, జెడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి, పలు శాఖల జిల్లా అధికారులు రాజ్యలక్ష్మి, తులసి, నాగశైలజ, లక్ష్మి, పద్మనాభం, విజయేంద్రరావు, చిన్నారెడ్డి, నరసింహులు, ఉమాదేవి, కలెక్టరేట్ ఏవో కులశేఖర్, పండ్ల పరిశ్రమల సమాఖ్య నాయకులు కట్టమంచి బాబి, తలపుల పల్లి బాబురెడ్డి, పీకేఎం–ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు భూపేష్ పాల్గొన్నారు.

అత్యుత్తమంగా తీర్చిదిద్దుతా...

జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించి అత్యుత్తమంగా తీర్చిదిద్దుతానని కలెక్టర్ సగిలి షన్‌మోహన్ అన్నారు. గొప్ప చరిత్ర కలిగిన చిత్తూరు జిల్లాలో మొదటిసారిగా జిల్లా కలెక్టర్‌గా పని చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తానన్నారు. తాగునీటి సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెడతామని వెల్లడించారు. పేదలకు ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని, స్పందన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

2013 –బ్యాచ్

2013 బ్యాచ్‌లో సగిలి షన్‌మోహన్ ఐఏఎస్‌గా ఎంపికయ్యారు. ఆయన గతంలో ప్రకాశం జిల్లాలో ట్రైనీ కలెక్టర్, జాయింట్ కలెక్టర్, సీఆర్‌డీఏ అదనపు కమిషనర్‌గా పనిచేశారు. అనంతరం రాష్ట్ర స్థాయిలో వివిధ హోదాల్లో పనిచేశారు. రాష్ట్ర స్టీల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీగా ఉంటూ అదనంగా గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ రాష్ట్ర డైరెక్టర్‌గా మారిటైమ్ బోర్డు (సముద్ర రవాణాకు సంబంధించిన) సీఈవోగా పనిచేస్తూ బదిలీపై తొలిసారిగా చిత్తూరు జిల్లా కలెక్టర్‌గా నియమితులయ్యారు.

వరసిద్ధుని సేవలో నూతన కలెక్టర్

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ ఎస్.షన్‌మోహన్ సోమవారం దర్శించుకున్నారు. ఉదయం ఆయన కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదంపడితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రేణుక, ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, ఐరాల తహసీల్దార్ సుశీల, తవణంపల్లె ఎస్ఐ ప్రసాద్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్వామివారి చిత్రపటం అందుకుంటున్న కొత్త కలెక్టర్



నేడు ఉపాధ్యాయులకు బైజూస్‌పై శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బైజూస్ కంటెంట్‌పై మంగళవారం ఆన్‌లైన్‌లో శిక్షణ ఉంటుందని డీఈవో విజయేంద్రరావు వెల్లడించారు. ఈ మేరకు ఆయన విలేకరులతో మాట్లాడుతూ 8వ తరగతి బోధించే టీచర్లకు కార్వేటినగరం ప్రభుత్వ డైట్ కళాశాల ఆధ్వర్యంలో ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులకు తెలిపిన సంబంధిత సమయాల్లో ఆన్‌లైన్ శిక్షణకు తప్పనిసరిగా హాజరుకావాలని డీఈవో వెల్లడించారు.

వేసవి కోతలకు సెలవు

- నిరంతర సరఫరాకు పకడ్బందీ చర్యలు
- సత్ఫలితాలు ఇస్తున్న ముందస్తు కసరత్తు
- వినియోగం పెరిగినా ఇబ్బంది లేనట్టే

యాదమరి: ఈ వేసవిలో విద్యుత్ కోతలాంటి వెతలు ఉండవు. గత ఏడాది తరహాలోనే ఈ సారి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. లైన్‌లాస్‌ను తగ్గించడం, అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడం, వాటి సామర్థ్యం పెంచడం లాంటి చర్యలు ఇందుకు దోహదపడుతున్నాయి. దీంతో ఈ వేసవి సీజన్‌లో ప్రజలకు విద్యుత్ కోతలు లేకుండా చూస్తున్నారు. మార్చి, ఏప్రిల్ నెలలు వచ్చాయంటే గత ప్రభుత్వాల్లో కోతలతో ప్రజలు నరకం చూసేవారు. లోడ్ రిలీఫ్(ఎల్.ఆర్) మెయింటినెన్స్ వంటి పేర్లతో దొడ్డిదారిన విద్యుత్ సరఫరాకు కోతలు పెట్టేవారు. అటువంటి పరిస్థితికి భిన్నంగా విద్యుత్ సరఫరాలో ఈసారి గణనీయమైన ప్రగతి సాధించారు. ఎండల ఫలితంగా విద్యుత్ వినియోగం పెరిగినా ఎక్కడా కోతలు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయగలుగుతున్నారు. ఈదురుగాలులు, వర్షాల సమయంలో మాత్రమే సరఫరాకు అంతరాయం కలుగుతోంది తప్ప మిగిలిన సందర్భాల్లో సరఫరాకు ఎటువంటి ప్రతిబంధకాలు ఉండడం లేదు. కోతల పరిస్థితి ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.57.40 కోట్లు వెచ్చించింది. దీంతో సుమారు 808 అదనపు విద్యుత్ సరఫరా ట్రాన్స్‌ఫార్మర్లకు యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయగలిగారు.

మార్చి నుంచి పెరుగుదల

చిత్తూరు జిల్లాలో మండుతున్న ఎండలతో రోజురోజుకూ విద్యుత్ వినియోగం పెరిగిపోతోంది. గత మార్చి రెండో వారంలో మొదలైన వేసవి తీవ్రత ఏప్రిల్ మొదటి వారానికి వచ్చేసరికి ఒక్కసారిగా పెరిగిపోయింది. మధ్యలో తేలికపాటి వర్షాలు కురిసిన వేడిమాత్రం తగ్గలేదు. దీంతో మధ్యాహ్నం ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేకపోతున్నారు. ఇలా ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకు, రాత్రి 8 గంటల తరువాత నుంచి ఇళ్లలో విద్యుత్ వినియోగం బాగా పెరిగిపోయింది. గతంలో పట్టణాల్లో సంపన్న వర్గాల ఇళ్లలోనే ఏసీలు ఉండేవి. ఇప్పుడు సులభతరమైన చెల్లింపులు అందుబాటులో రావడంతో చిన్న, మధ్యతరగతి అనే తేడా లేకుండా అన్ని ఇళ్లలో దాదాపు ఏసీలు వినియోగిస్తున్నారు.

గృహనిర్మాణమే ఎక్కువ

విద్యుత్ వినియోగంలో గృహ వినియోగానిదే సింహభాగం, జిల్లాలో 13,73,346 గృహావసరాల కనెక్షన్లు ఉన్నాయి. వీటి వినియోగం విషయంలోనే హెచ్చు తగ్గులు ఉన్నాయి. గత జనవరి నుంచి ఏప్రిల్ వరకు గృహ విద్యుత్ వినియోగాన్ని పరిశీలిస్తే ప్రతి నెలా రెండు మిలియన్ల యూనిట్లు పెరుగుతూ వస్తున్నది. ఏప్రిల్, మే, జూన్‌లో గృహ వినియోగం ముందస్తు అంచనాల ప్రకారం చూస్తే రెండు మిలియన్ల కంటే ఎక్కువ వాడకం ఉండే అవకాశాలు ఉంటున్నాయి. అందుకు తగ్గట్టుగా విద్యుత్ సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.


జీడీనెల్లూరులో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

సబ్‌స్టేషన్లు ఏర్పాటు

వేసవి వచ్చి రావడంతోనే గృహ విద్యుత్ వినియోగం పెరిగిపోతోందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ వినియోగానికి తగ్గట్లుగానే విద్యుత్ ఉత్పత్తికి ఢోకా లేకపోవడంతో కోతలు విధించాల్సిన అవసరం ఎదురుకాదని ఏపీఈపీడీసీఎల్ వర్గాలు చెబుతున్నాయి. సరఫరాకు ఇబ్బందులు ఎదురుకాకుండా పలు మండలాల్లో 33 కేవీ, 11 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఎక్కడైనా ఎక్కువ వినియోగించే మండలాల్లో ఇబ్బందికరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను మార్పు చేస్తున్నారు. పుంగనూరులో నూతనంగా సబ్ స్టేషన్ ప్రారంభించారు. యాదమరి మండలం పెరియంబాడిలో నూతనంగా సబ్‌స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.

ముందస్తు చర్యలు



వేసవి సీజన్ మొదలైంది. జిల్లా పరిధిలో డిమాండ్ తగ్గట్టుగా విద్యుత్ ఉత్పత్తి ఉంటుందని పైనుంచి ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఈ వేసవిలో విద్యుత్ కోతలు దాదాపు ఉండవు. ఏ ఒక్క వినియోగదారుడికీ ఇబ్బంది కలగని రీతిలో ఏర్పాటు చేస్తున్నాం. గత ఏడాది విద్యుత్ వినియోగం అంచనాలను దృష్టిలో పెట్టుకొని ఈ సీజన్‌లో విద్యుత్ ఎంత అవసరమో అవుతుందో లెక్కలేశాం. గతేడాది ఎదురైన ప్రతిబంధకాలను అధిగమించేదుకు అనేక ముందస్తు చర్యలు తీసుకున్నాం. అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశాం. ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు సామర్థ్యం పెంచాం.
– హరి, ఎస్ఈ, జిల్లా విద్యుత్‌శాఖ ఇన్‌చార్జ్



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,500
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.75,000
రిటైల్ వెండి గ్రాము	రూ.77

వ్యక్తికి రిమాండ్

కుప్పంరూరల్: ఇంట్లో ఎవరూ లేని సమయంలో మహిళలపై కత్తితో దాడి చేసిన కేసులో ఓ వ్యక్తిని రిమాండ్‌కు తరలించిన సంఘటన కుప్పం పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శివకుమార్ కథనం మేరకు, కుప్పం మండలం, జరుగు పంచాయతీ సలార్లపల్లిలో ఆదివారం నరసింహులు భార్య శ్రీదేవి ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తుండగా, అదే గ్రామానికి చెందిన మూర్తి కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన శ్రీదేవి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితురాల ఫిర్యాదు మేరకు మూర్తిని అరెస్టు చేసి సోమవారం పోలీసులు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

అనుమతి లభించడం హర్షణీయం

చిత్తూరు కలెక్టరేట్ : తెలుగుభాషలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ), కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ (సీపీటీ) నిర్వహణకు రాష్ట్ర సాంకేతిక విద్యాశిక్షణా సంస్థ అనుమతి లభించడం హర్షణీయమని టైప్ రైటింగ్ సంస్థల నిర్వాహకులు అన్నారు. ఈ మేరకు చిత్తూరు టైప్‌రైటింగ్ సంస్థల ప్రిన్సిపళ్ల సంఘం అధ్యక్షులు రవిచంద్రారెడ్డి, కార్యదర్శి మణి సోమవారం విలేకరులతో మాట్లాడారు. సీపీటీ, సీబీటీపై శిక్షణను టైప్ రైటింగ్ సంస్థల్లో ఇచ్చేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం గొప్పవిషయమన్నారు. ఈ అనుమతి వల్ల అనేక మందికి లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ప్రభుత్వానికి తాము రుణపడి ఉంటామని వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు హరి, హేమాపతి, బాలాజి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రవిచంద్రారెడ్డి

జింక చర్మంపై కేసు నమోదు

చిత్తూరు కార్పొరేషన్: కాణిపాక అనుబంధ ఆలయ అర్చకులు జింకల చర్మాన్ని వినియోగించినందుకుగాను వారిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్వో బాలకృష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు వన్యప్రాణులచట్టం కింద ఏ-1గా జింక చర్మాన్ని విక్రయించిన శివ, వాటిని వినియోగించినందుకు ఏ-2గా కృష్ణమోహన్, ఏ-3గా రవిచంద్రపై కేసు నమోదు చేసి నిబంధనల ప్రకారం బెయిల్ మంజూరు చేశామని వివరించారు.

మహిళల అభ్యున్నతే జగనన్న లక్ష్యం

- డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం: మహిళల అభ్యున్నతే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల పరిధిలోని వీవీ పురం పంచాయతీలో చేకూరివారి ఇండ్లు, పెద్దకొండేపల్లి, అంకనపల్లి దళితవాడ, ఆరిమాకులపల్లి గ్రామంలో పర్యటిస్తూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. అనంతరం ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తుంటే జీర్ణించుకోలేని చంద్రబాబు, ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని విషప్రచారం చేస్తున్నారని అన్నారు. చంద్రబాబు తొత్తుగా మారిన రామోజీరావు మార్గదర్శి కుంభకోణంలో ఆధారాలతో పట్టుబడ్డాడని, వాటి నుంచి తప్పించుకోడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నాడని అన్నారు.

అన్ని వర్గాలను మోసం చేసింది బాబే

చంద్రబాబు అన్ని వర్గాలను మోసం చేశారని, 14 ఏళ్ల పాలనలో రాష్ట్రాన్ని కరువు అంధకారంలోకి నెట్టి, కులాలకు, మతాలకు మధ్య చిచ్చుపెట్టి పైశాచిక ఆనందం పొందారని ఆరోపించారు. చంద్రబాబు 5లక్షల ఇళ్ల నిర్మా ణం చేపడతానని చెప్పి మామూళ్లకు పాల్పడ్డారని ఆరోపించారు. ఏనాడూ పేదలకు ఇంటి స్థలం ఇచ్చిన పాపాన పోలేదని విమర్శించారు. పెద్ద కొండేపల్లిలో గ్రామస్తులు డిప్యూటీ సీఎం నారాయణస్వామికి తమ గ్రామంలో కమ్యూనిటీహాల్, వాటర్‌ట్యాంకు, కొత్త ఇండ్లకు విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ కొరత ఉందని విన్నవించారు. దీంతో స్పందించిన మంత్రి వెంటనే గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాల్లో భాగంగా ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, నవరత్నాల్లో 7 పథకాలను మహిళల పేరిట అందిస్తూ మహిళా పక్షపాతిగా నిలుస్తున్న జగనన్నకి అక్క చెల్లెమ్మలే అండగా నిలుస్తారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లక్ష్మమ్మ, జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ మణి, మాజీ జెడ్పీటీసీ గురువారెడ్డి, నాయకులు జనార్దన్, అనంతరెడ్డి, దామునాయుడు, ప్రసాద్‌రెడ్డి, డిశెంబర్‌శెట్టి, గుణశేఖర్‌నాయుడు, దామాచారి, తహసీల్దార్ లోకనాథపిళ్లై, ఎంపీడీవో క్రిష్ణయ్య, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

అదుపు తప్పి ఆర్టీసీ బస్సు బోల్తా

వడమాలపేట : సత్యవేడు నుంచి తిరుపతికి వెళుతున్న ఆర్టీసీ బస్సు అదుపుతప్పి వాగులో పడడంతో ప్రయాణికులు గాయాల పాలైన సంఘటన మండలంలోని సోమవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, సత్యవేడు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఉదయం ప్రయాణికులతో తిరుపతికి బయల్దేరింది. మార్గమధ్యంలో వడమాలపేట దాటుకున్న తరువాత చీమల వారి వాగుపై నిర్మించిన బ్రిడ్జిపై అదుపు తప్పి పక్కనే ఉన్న వాగులో పడిపోయింది. అయితే స్వల్ప గాయలతో ప్రయాణికులు బయటపడ్డారు. ప్రమాదం జరిగినప్పుడు బస్సులో సుమారు 60 నుంచి 70 మంది ప్రయాణికులు ఉన్నారని తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ప్రయాణికులను బయటకు తీస్తున్న దృశ్యం

కర్ణాటక మద్యం పట్టివేత


పట్టుబడిన మద్యం, నిందితుడిని చూపుతున్న సెబ్ సీఐ ఎల్లయ్య, సిబ్బంది

పలమనేరు: పలమనేరు సెబ్ పరిధిలో సోమవారం వేర్వేరు చోట్ల అధికారులు దాడులు నిర్వహించారు. పట్టణ సమీపంలోని క్యాటిల్‌ఫామ్ బ్రిడ్జి వద్ద మార్జేపల్లెకు చెందిన ఆనంద, శ్రీనివాసులు నుంచి రూ.1.5 లక్షలు విలువచేసే 2400 మద్యం ప్యాకెట్లు, ఓ బైక్‌ను సీజ్ చేశారు. మరో వ్యక్తి కర్ణాటకకు చెందిన మునిరాజులు పరారయ్యాడు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు సెబ్ సీఐ ఎల్లయ్య తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐలు రామదాసు, రామమూర్తి సిబ్బంది పాల్గొన్నారు. బోర్డర్‌లోని చెక్‌పోస్టు సీఐ మాధవస్వామి ఆధ్వర్యంలో జరిగిన తనిఖీల్లో మార్జేపల్లెకు చెందిన పవన్ కుమార్ అక్రమంగా తీసుకెళుతున్న 28 టెట్రాప్యాకెట్లను సీజ్ చేసినట్టు తెలిపారు.

నగరిలో ఉన్నతాధికారుల పర్యటన


సమావేశంలో మాట్లాడుతున్న విజయబాబు

నగరి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఉన్నత స్థాయి అధికార బృందం సోమవారం సందర్శించింది. ఇందులో భాగంగా కళాశాలకు ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ, ఏపీసీసీఈ నాక్ డా.విజయబాబు, అకడమిక్ ఆఫీసర్స్ వరప్రసాద్, డా.జాన్‌కిరణ్ బృంద ప్రతినిధులుగా విచ్చేసి కళాశాలలోని అన్ని విభాగాలను పరిశీలించారు. భౌతిక సౌకర్యాలు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, జేకేసీ తదితర విభాగాల పనితీరు పరిశీలించి నాక్ మంచి గ్రేడ్ పొందడానికి అవసరమైన సూచనలు, సలహాలు అందించారు. నేషనల్ అసెస్మెంట్, అక్రెడిటేషన్ (నాక్) పీర్ టీమ్ విజిట్ (పీటీవీ) ఈ నెల 19, 20 తేదీల్లో కళాశాలలో పర్యటించనున్న సందర్భంగా, సన్నాహక చర్యలను పరిశీలించి, తగిన సూచనలు, సలహాలు ఇవ్వడానికి ఉన్నత స్థాయి బృందాన్ని విచ్చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ భాస్కర రాజు, ఐక్యూ కో-ఆర్డినేటర్ మురళీ మోహన్ రెడ్డి, అకడమిక్ కో-ఆర్డినేటర్ వేణుగోపాల్, ఎన్‌సీసీ అధికారి భాస్కర్ ప్రోగ్రాం అధికారి గోపి, పంకజ, ఇందిరా ప్రియదర్శిని, అరుణ కుమారి, సుబ్రహ్మణ్యం, షరిమ్మల, రమణా రెడ్డి,. మున్వర్, రామాంజులు, విజయ బాబు, రమేష్ బాబు, నాగార్జున, లాల్‌బాషా ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మిల్క్ పార్లర్ ఇస్తామని రూ.5.78 లక్షలకు టోకరా

చిత్తూరు అర్బన్: ప్రముఖ పాల డెయిరీకి చెందిన పదార్థాలు విక్రయించుకునే పార్లర్‌కు ఫ్రాంచైజీ ఇస్తామని నమ్మించి ఓ యువకుడి నుంచి ఆన్‌లైన్‌లో రూ.5.78 లక్షలు కాజేశారు. దీనిపై బాధితుడు సోమవారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఆర్.పురానికి చెందిన లోకనాథరెడ్డి చిత్తూరు నగరంలోని ఓ మొబైల్ షాపులో పనిచేస్తున్నాడు. తన ఊరిలో పాల పదార్థాలు విక్రయించే పార్లర్‌కు ఫ్రాంచైజీ తీసుకోవాలని గత నెల ఆన్‌లైన్‌లో కనిపించిన ఓ ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేసి మాట్లాడాడు. పది రోజుల్లో అనుమతి ఇస్తామని ఫోన్‌లో చెప్పిన వ్యక్తి మాటలు నమ్మిన లోకనాథరెడ్డి గతనెల 25 నుంచి ఈ నెల 3వ తేదీ వరకు దశల వారీగా రూ.5.78 లక్షలు ఆన్‌లైన్‌లో చెల్లించాడు. తీరా తాను మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరసింహరాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో.. యువకుడు మృతి


మృతి చెందిన కెల్విన్

గుడిపాల: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రాజశేఖర్ కథనం మేరకు, మండలంలోని రాసనపల్లె దళితవాడకు చెందిన కెల్విన్(18), చంద్రు(20) ద్విచక్ర వాహనంపై మధ్యాహ్నం బయల్దేరారు. చెన్నై- బెంగళూరు జాతీయ రహదారిలోని ముట్టుకూరుపల్లె వద్ద గుడిపాలలోని 190 రామాపురానికి చెందిన విజయ్ ట్రాక్టర్‌లో వారి బైక్‌ను ఢీ కొన్నాడు. దీంతో కెల్విన్ అక్కడికక్కడే మృతి చెందాడు. చంద్రుకు తీవ్రగాయాలు కావడంతో 108 వాహనం ద్వారా చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళ దుర్మరణం

తవణంపల్లె: మండలంలోని తెల్లగుండ్లపల్లె సమీపంలో లారీ, కారు ఢీకొన్న ప్రమాదంలో మహిళ మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ సుబ్రమణ్యం తెలిపారు. ఆయన కథనం మేరకు తిరుపతి- బెంగళూరు హైవేలో ఆదివారం రాత్రి బెంగళూరు వైపు లారీ వెళుతుండగా, దాన్ని టవేరా కారు వెనుక నుంచి ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న శ్రీధర్ భార్య లక్ష్మీదేవి(29)తీవ్రంగా గాయపడింది. వెంటనే బెంగళూరు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు సుబ్రమణ్యం తెలిపారు. మృతురాలి తమ్ముడు శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.